డబ్బు విలువ
తెలుసుకున్న అతడు
తీసుకున్న నిర్ణయం?

గొల్లి
మహేశ్వరి
కథ

# మేల్కొన్న వివేకం


సంధ్యవేల ఆరుగంటల సమయంలో మెర్క్యూరీ లైట్లతో కన్నులు మిరుమిట్లు గొలిపే కాంతిలో విజయవాడ నగర శోభ వెలిగేవేళలో ఇంటర్నేషనల్ కాంధారీ హోటల్‌నుంచి బయటకడుగుపెట్టిన రమేష్, జగదీష్‌లిద్దరూ హుషారుగా ఈలవేసుకుంటూ ముందుకుసాగారు. కొద్ది దూరం వెళ్ళేసరికి రమేష్‌కేదో గుర్తుకువచ్చి హఠాత్తుగా జేబు తడుముకుంటూ ఒక్కసారిగాడీలా పడిపోయి రోడ్డుకు కొంచెం ప్రక్కగావున్న గట్టుమీద చితికిలపడి వుసూరుమంటూ నిట్టూర్చాడు. స్నేహితుడి నీరసపు ముఖాన్ని చూసిన జగదీష్ ఆశ్చర్యంగా విషయమేమిటని ప్రశ్నించాడు.

''ఇందాక కాలేజినుంచి వచ్చిన తరువాత కాఫీ తాగి బయల్దేరుతుంటే మా అమ్మ ఇంటికి కావాల్సిన సరుకులు కొద్దికొద్దిగా తెమ్మని యాభై రూపాయలిచ్చింది. కొంత దూరం వచ్చాక నువ్వు కనుపించి ఇక్కడికి లాక్కువచ్చావు. ఇంత పెద్ద హోటల్‌ను చూసేసరికి నేనుకూడా వొళ్ళు తెలియకుండా నీతోపాటు ఖర్చుపెట్టాను'' అన్నాడు రమేష్.

''అయితే అయిపోయిందానికంత ఆలోచనెందుకోయ్ '' ధీమాగా అన్నాడు జగదీష్

''మా అమ్మ ఇచ్చిన యాభైలో ముప్ఫయి రూపాయలు ఖర్చయిపోయాయి. ఇంక మిగిలింది ఇరవై రూపాయలు మాత్రమే రా... వీటితో మా అమ్మ చెప్పిన వెచ్చాలెలా వస్తాయి''.

''ఓస్... ఈ మాత్రానికేనా'' పకపక నవ్వాడు జగదీష్.




"నీకు నవ్వులాటగానే వుంటుందిలే. కడుపు పూర్తిగా నిండినట్లులేదు. వెధవ బిల్లు ముప్పయి రూపాయలయింది. దానికి తోడు బోడి టిప్పులొకటి, కావల్సినవి తినటమైం తరువాత బేరర్ బిల్లు ఫోల్డర్‌లో పెట్టి తీసుకువచ్చినప్పుడు నువ్వు డబ్బు ఇచ్చేసి వూరుకోకుండా గొప్పగా ఇంకో అయిదు రూపాయలు టిప్పుకింద ఇచ్చావు.

ఇంక నేను కూడా అలా ఇవ్వకపోతె బాగుండదేమోనని ఐదు రూపాయలివ్వక తప్పలేదు''. ఏడుపు ముఖం పెట్టాడు రమేష్.

''ఓరి పిచ్చి ముఖమా టిఫెన్ క్లాస్‌గా తిని టిప్పు ఇచ్చేటప్పుడు ఇలాంటి పెద్దపెద్ద హోటల్స్‌లో పావలానో, అర్ధ రూపాయో ఇస్తే ఆ బేరర్ మనల్నో పిచ్చివెధవలుగానో, పీనాసి వెధవలుగానో జమకట్టి వూరుకుంటాడు. మళ్ళీ యెప్పుడయినా ఆ హోటల్ కెళ్ళామనుకో వాళ్ళు మనకేసి చూడను కూడా చూడరు. ఇప్పుడు చూడు మనం దర్జాగా ఐదు రూపాయలు వేశామా... రేపు మనం మళ్ళీ వస్తే వాడు చేతులు కట్టుకుని వంగివంగి సలాములు చేస్తూ ఏం కావాలని వినయంగా అడుగుతాడు తెలుసా...?'' అన్నాడు కాలరెగరేస్తూ జగదీష్.

''ఏడ్చినట్లుంది వాడిబోడి వినయాలు మన కడుపునింపుతాయా, ఎదురు జేబులు ఖాళీ అవుతాయి. నేరక వచ్చాను శుభ్రంగా మామూలు రెస్టారెంట్‌కు వెళ్తే యెంత కడుపునిండా తిన్నా పది రూపాయలు కూడా కావు. కొద్దే కాబట్టి అమ్మకేదో సర్దిచెప్పుకునే వాణ్ణి, ఇప్పుడు ముప్పయి రూపాయలకు యెలా లెక్కచెప్పాలీ... మా అమ్మ తొంభై ఆరాలు తీస్తుంది యెలా...''

''ఒరేయ్ చవటాయ్ ఇలా ఖర్చుపెట్టే ప్రతి పైసకూ వంద ఆలోచిస్తే నువ్వు జీవితంలో యెంజాయ్ చెయ్యలేవురా, మనకు పెళ్ళయితే ఆ సంసార జంజాటంలో ఈ ఏడుపులెలాగూ తప్పవు, ఈ పెద్దోళ్ళ సణుగుళ్ళెప్పుడూ వుండేవే, ఏదో వొకటి చెప్పేయ్ అంతేగానీ వాజమ్మలా యేడుపు ముఖం మాత్రం పెట్టబోక... వస్తా... బై'' అంటూ అప్పుడే అటుగా వచ్చిన సిటీబస్ యెక్కేసి వెళ్ళిపోయాడు జగదీష్.

రమేష్ తేరుకుని చూసేసరికి బస్సు కదిలిపోవటం కూడా జరిగిపోయింది. తన తోవచ్చినవాడు వెళ్ళేటప్పుడు ఇలా సడన్‌గా వొక్కడే వెళ్ళిపోవటానికి కారణమేమిటో... బహుశా తనని సర్దమని అడుగుతాననుకున్నాడు కాబోలు... ఆలోచిస్తూనే ఇంటిదారి పట్టాడు రమేష్.

రమేష్ ఇంటికి వెళ్ళగానే తల్లి సుశీల యెదురువస్తూ కొడుకు ఖాళీ చేతులుచూసి ''అదేంరా నేను చెప్పినవి తీసుకురాలేదూ'' అన్నది.

''మరీ... మరీ...''

''ఏవిటో చెప్పక నీళ్ళు నములుతావేంరా

మా ఫ్రెండ్ కన్పించి హోటల్‌కు లాక్కుపోయాడు'' నసిగాడు.

''పోనీలే మన రోడ్డు మొదట్లో చలమయ్య కొట్టు పదకొండుదాకా తెరిచేవుంటుందిగా, ఇప్పుడు వెళ్ళి తీసుకుని రారా...''

''ఖర్చయిపోయిందమ్మా''.

''ఏవిటీ... ఈ కొద్దిసేపటిలోనే యాభై రూపాయలెలా ఖర్చయ్యాయిరా...'' ఆవిడ నోరు వెళ్ళబెట్టింది.

అదికాదు కొద్దిగా వుందనుకో''.

''మరదేం చేసావు? దానితో యేవి వస్తే అవే తీసుకురాకపోయావూ, ఇంట్లో మరీ బొత్తిగా అన్నీ నిండుకున్నాయి.

అప్పుడే భోజనం పూర్తిచేసి ఇవతలకు వచ్చిన చలపతిరావు "వాడింకేంచెప్తాడే, చెప్పేదేదో చెప్పేశాడుగా, మిగతాది నేను చెప్తాను విను, వాడు, వీడు కలిసి ఏ.. ఎ.సి హోటల్‌కో చెక్కేసి వుంటారు. అక్కడ జేబులు ఖాళీ అయివుంటాయి.


**ఒరేయ్** ... అలాంటి హోటల్స్ బలిసినోడికీ, తాతముత్తాతలు సంపాదించి పేళ్ళకిస్తే, అదెలా ఖర్చు పెట్టాలో తెలియని వాడికీ, డబ్బు విలువ తెలియని వాడికీగానీ, మనలాంటి కష్టజీవులకు, సామాన్యులకు, ఆకలి కడుపులకు పనికి వచ్చేవి కావురా, తోటివాళ్ళు తొడకోసుకుంటే మనం మెడకోసుకోవటం కాదురా, మన తాహతెంతని ఆలోచించుకోవాలి తెలిసిందా...?" అన్నారాయన.

"నేనేం రోజూ వెళ్తున్నానా, ఒక్కరోజుకీ..." రమేష్‌కు కోపం వస్తోంది. చటుక్కున మిగిలింది జేబులోనుంచి తీసి అక్కడే వున్న టేబుల్‌మీద పెట్టేశాడు.

"ఒక్కపూటకు నువ్వు ముప్పయి రూపాయలు ఖరుచేశావు మరి ఆ ముప్పయి రూపాయలు సంపాదించటానికి నేనెన్ని పూటలు కష్టపడుతున్నానో తెలుసుకున్నావా ...? నీ తండ్రి సామాన్య గుమస్తా గిరి వెలగబెడ్తున్నవాడే కానీ లక్షాధికారీ, జమిందారు కాదు. పోనీ ఆ ఫ్రెండెవడో నిన్ను తీసుకు వెళ్ళినవాడు నీకోసం ఒక్కపైస యినా ఖర్చుపెట్టాడా, వాడి డబ్బు వాడు జాగ్రత్తగానే చూసుకున్నాడు. తుప్పు వొదిలింది నీకు, ఇప్పటికయినా తెలిసిందట్రా..." అన్నారు.

"సర్లే సోది ఒక్కసారి ఖర్చుపెట్టినందుకింతరాద్ధాంతం చేస్తారేం" విసురుగా అన్నాడు రమేష్.

"ఓ యబ్బో, మాలావు పౌరుషం పొడుచుకొచ్చిందే? అంత మొనగాడివయితే యేదీ ఒక్కపూటలో కాదు ఒక్క రోజులో ముప్ఫయి రూపాయలు సంపాదించవోయ్ చూద్దాం"



## కట్నం!

కుర్రి బిచ్చగాడు ఆసక్తిగా అడిగాడు ముసలి బిచ్చగాణ్ణి "నీ కూతుర్ని పెళ్ళాడినందుకు నాకు కట్నం ఏమిస్తావ్ మావా?"

"తిరుమల, ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్సుల్లో ముష్టెక్కడివే అడుక్కునే వీలు కల్పిస్తాలేరా... అదే నేనిచ్చే కట్నం..."

"....!?!?"

పొలిశెట్టి బదర్స్ (వడ్లమూరు)

అన్నారాయన. రమేష్ చరచర అవతలకు వెళ్ళిపోయాడు. ఆ రాత్రి భోంచెయ్యలేదు. ఆలోచిస్తూ పడుకున్నాడు.

నిదానంగా ఆలోచిస్తే ఖచ్చితంగా అన్నా తండ్రి మాటలు కరెక్టేమోననిపించసాగింది

జగదీష్ కనీసం కిళ్ళీలకయినా ఖర్చు పెట్టలేదు. ఆఖరికి బస్సుక్కర్చు పెట్టాల్సొస్తుందని కాబోలు తనొక్కడే గభాల్ని వెళ్ళిపోయాడు ఇప్పుడర్థమవుతోంది. ఏదయినా తనెలాగయినా కష్టపడి తండ్రి చెప్పినట్లు వొక్క రోజులో ఆ ముప్ఫయి రూపాయలు సంపాదించి తనేవిటో చూపించాలి. గట్టి నిర్ణయం చేసుకుని పడుకున్నాడు రమేష్.

మర్నాడు చికటితోనే లేచి బయటకు వెళ్ళిపోయాడు. రమేష్. కానీ యేం పనిచెయ్యాలో తెలియటం లేదతనికి. ఇంతలో పళ్ళ కొట్లదగ్గరకు వచ్చేసరికి అక్కడ లారీల్లో పళ్ళను కొంతమంది గంపల్తో మోసుకెళ్ళి స్టాకు రూమ్‌లో వేస్తుంటే చూసి తనుకూడా ఆ పనిలో చేరాడు. మధ్యాహ్నం దాకా చేరవేస్తే ఇరవై రూపాయలు చేతికి వచ్చాయి. యెండ నడినెత్తికెక్కింది. కడుపులో కరకరమంటూంది. రోజూ దర్జాగా కాలేజీనుంచి ఇంటికి వెళ్తే తల్లి ఆప్యాయంగా కడుపునిండా భోజనం పెట్టేది. ఒక్కక్షణం ఇంటికి వెళ్ళిపోవాలన్పించినా అంతలోనే పౌరుషం తన్నుకొచ్చింది. ఏదయినా హోటల్‌కు వెళ్ళాలన్పించింది కానీ అది విరమించుకొని పళ్ళకొట్టు వాళ్ళిచ్చిన నాలుగు పళ్ళు తిని సోడా తాగి మరోచోటికి వెళ్ళి సాయంత్రానికి మరో పది రూపాయలు సంపాదించాడు కానీ వొళ్ళంతా నొప్పులతో అతలాకుతల మయినట్లుంది.

ఎలాగో డబ్బు సంపాదించగలిగినా వొంట్లో యెంతో శక్తి పోయినట్లు నిస్సత్తువగా అనిపించింది. ఒక్కరోజుకే వయసులోవున్న తనే ఇంత అలసటకు లోనయితే మరి యాభైదాటిన తండ్రికేం శక్తి వుంటుందీ... అందులో సామాన్యపు తిండి తిని తిన్నదానికంటే కుటుంబంకోసం కష్టపడే తన తండ్రి మాటో... ఆయనన్న మాటలు అబద్ధం కాదేమో...

మళ్ళీ అంతలోనే ''ఎ.సి.'' హోటల్లో కూర్చుని తింటే ఆ చల్లదనానికి తన అలసటంతా తీరిపోతుందనిపించి ఇంతసేపూ ఆలోచించినవి ప్రక్కకు నెట్టేసి అక్కడికే దారితీశాడు రమేష్. తీరా అక్కడకు వెళ్ళేసరికి యెందుకో అతని కాళ్ళు ఠక్కున ఆగిపోయాయి. బుర్ర స్వక్రమంగా పనిచేయనారంభించింది. తనీ హోటల్లో తింటే యీ డబ్బంతా క్షణాల్లో ఖాళీ అయిపోతుంది. అంటే... పగలంతా యెండలో ఆకలితో మాడి సంపాదించిన డబ్బంతా నిముషాలమీద ఖర్చయిపోతుందనుకుంటే వుసూరుమనిపించింది. అప్రయత్నంగా జేబులోని డబ్బు చేతిలోకితేసి చూసుకున్నాడు. అది ప్రాణంలా అన్పించింది. విచ్చలవిడిగా ఖర్చుపెట్టినందుకు తండ్రికెందుకంత కోపం బాధ కలిగిందో అర్థమయింది.

అంతే రమేష్ వెనక్కు మరలాడు. బజారుకు వెళ్ళి తనదగ్గరున్న డబ్బుకు సరిపడా వచ్చినన్ని, ఇంటికి కావల్సిన సరుకులు తీసుకుని, రెండు రూపాయలు మిగిలితే దానితో పకోడీలు పొట్లాం కట్టించి ఇంటికి తీసుకు వెళ్ళాడు. తలుపు తీసిన తల్లి

"ప్రొద్దుటినుంచే యేమీ తినకుండా యెక్కడకు వెళ్ళావురా" అంటున్న తల్లికేమీ సమాధానం చెప్పకుండా చేతిలోనివి ఆమె చేతికిచ్చాడు. అప్పుడు తల్లి ముఖంలో తృప్తేకాక, ఆ కళ్ళల్లోని తడిని స్పష్టంగా గమనించింది.


కానీ ఆ తడిలో విచారం కాదు. ఆనందం కనిపించి తన తప్పు దిద్దుకున్నట్లు మనసు రిలీఫ్ ఫీలయ్యింది. పకోడీ పొట్లం విప్పి తమ్ముళ్ళకు, చెల్లెళ్ళకు పెట్టాడు. వాళ్ళ ముఖాలు వెలిగిపోవటమే కాక వాటిని వాళ్ళు ఎంతో ప్రాణంగా తింటూంటే తన అలసటంతా మాయమయినట్లనిపించింది రమేష్‌కు.

తల్లి వేడివేడి కాఫీ తెచ్చి చేతికివ్వగానే నెమ్మదిగా సిప్‌చేస్తూ తాగుతుంటే మనసు కనిపించింది. ఎంత పెద్ద హోటల్లో కూర్చుని తిన్నా యీ ఆప్యాయత తనకు లభించేదా, డబ్బంతా తనొక్కడే అనుభవిస్తే యీ తృప్తి మిగిలేదా...

కాస్త స్వార్థం ప్రక్కకువెట్టి వుండకపోతే ఇంతమంది కన్నుల్లో తను చూసివుండేవాడా ... ఇంతలో తండ్రి రావటంతో పిల్లలన్నీ చెప్పేస్తుంటే తండ్రి తనవయిపోసారి చూసి దగ్గరకు వచ్చి వెన్నుతట్టి ఆప్యాయంగా, వాత్సల్యంగా తల నిమిరి అవతలకు వెళ్ళారు. నోటితో వొక్క మాటనకపోయినా ఆయన అందించిన స్పర్శలో మాటల్లో నిర్వచించలేని ఆయన ఆనందం వ్యక్తమయ్యింది. అప్పుడు రమేష్ మనసులో గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఇంకెప్పుడూ తల్లితండ్రులకు బాధ కలిగించే పనులు చెయ్యకుండా సంతోష పెట్టాలనీ... మనసుకెంతో హాయిగా యెంతో శక్తి వచ్చినట్లనిపించింది.

*

## బట్టలెందుకు



*'అసలు బట్టలు ఎందుకు ధరించాలి?' అంటున్నాడు అమెరికాలోని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయ విద్యార్థి ఆండ్రూ మార్టినేజ్! గత మూడు నెలలుగా బట్టలు ధరించకుండా నగ్నంగా క్లాసుకు వెడుతున్న మార్టినేజ్‌ను మూడుసార్లు పోలీసులు అరెస్టు చేసినా కోర్టు విడిచిపెట్టేసింది! బట్టలు ధరించాలని కాలిఫోర్నియా రాజ్యాంగంలో వ్రాయలేదన్నది న్యాయమూర్తుల వాదన! ఇక లాభంలేదనుకున్న విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ 'దుస్తులు ధరించకుండా యూనివర్శిటీకి రానివ్వమని'' ఓ ఉత్తర్వును జారీ చేశారట! మార్టినేజ్ ఇక తప్పని సరిగా దుస్తులు ధరించాల్సిందే! పూర్ ఫెలో!!*

—జూపిటర్